20-10-02

సరైన వ్యాయామాలతో నడుమును బలంగా చేసుకోవడం ద్వారాను, నడుము భాగానికి గాయాలయ్యే పనులకు దూరంగా ఉండటం ద్వారాను కొన్ని రకాల నడుం నొప్పులను నివారించవచ్చు.

చదివేటప్పుడు, కూర్చునేటప్పుడు, నిలబడేటప్పుడు, పడుకున్నప్పుడు కూడా సరైన భంగిమను అనుసరించి నడుం నొప్పిని దూరంగా ఉంచవచ్చు (నిద్రించేటప్పుడు పక్కకు తిరిగి లేదా వెల్లకిలా పడుకున్నప్పుడు మోకాళ్ళ కింద దిండు ఉంచుకోవాలి).

ఏ విధమైన చికిత్స తీసుకోవాలి ?

అంతగా ప్రమాదకరం కాని వెన్ను నొప్పులకు విశ్రాంతి తీసుకుంటూ కొన్ని మందులు వాడితే సరిపోతుంది. నడుముకు సంబంధించి తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమైనప్పుడు ఆపరేషన్ అవసరమవుతుంది.

శరీరంలోని వెనుక భాగాలు

మెడ : విప్‌లాష్ సిండ్రోమ్. తలను ముందుకో, వెనక్కో వేగంగా వంచినట్లయితే మెడలోని లిగమెంట్లు తీవ్రమైన ఒత్తిడికి గురవుతాయి. (ఎముకలను కలిపి ఉంచే, సాగే గుణంలేని, గట్టి నారవంటి భాగాలను లిగమెంట్లు అంటారు.) నొప్పి, మెడపట్టేయడం ఈ పరిస్థితుల లక్షణాలు. గాయం తగిలిన అనేక గంటల తర్వాత సాధారణంగా ఇవి మొదలవుతాయి.

మెడ అటూ ఇటూ కదలక పట్టేయడం, తీవ్రమైన తలనొప్పి, వాంతులు, గందరగోళం, మత్తుగా ఉండటం, ఉజ్వలమైన కాంతిని భరించలేక పోవడం మెనింజైటిస్ లక్షణాలు (మెదడు, వెన్నుపాముల పైపొర అయిన మెంబ్రేస్ వాపు ఈ వ్యాధికి కారణం)

వెన్నెముకలలో ఏదైనా వెన్నుపూస స్థాన చలనం (స్లిప్డ్ లేదా ప్రొలాప్స్‌డ్ డిస్క్) ఫలితంగా భుజం, చేతుల్లో విపరీతమైన నొప్పి కలుగుతుంది. ఏ మాత్రం ఆ భాగాలు కదిలినా నొప్పి ఇంకా పెరుగుతుంది.

నడుము, భుజం నొప్పి, శ్వాస పీల్చినప్పుడల్లా అది పెరగడం, దగ్గు, జ్వరం మొదలైన లక్షణాలు న్యూమోనియా, ప్లూరసీ వంటి ఛాతీ వ్యాధుల వల్ల కావచ్చు.

నడుం నొప్పి, పట్టేసినట్లు ఉండటం, వేళ్ళు తిమ్మిరెక్కడం లేదా మొద్దు బారడం వెన్నెముకలోని ఎముకలకు ఆస్టియో ఆర్థ్రైటిస్‌కు సూచన.

వెన్ను మధ్యభాగం

ఒకే భంగిమలో ఎక్కువ సేపు కూర్చోవడం వల్ల పెరిగిపోయే వెన్ను నొప్పి సరిగా కూర్చోకపోవడం వల్లగాని, కుర్చీలో లోపం వల్లగాని కావచ్చు.

మానసిక ఒత్తిడి, ఆందోళన, దిగుళ్ళు కండరాలను బిగుసుకునేటట్లు చేసి వెన్ను భాగంలో నొప్పులకు కారణమవుతాయి. వెన్ను నొప్పికి ఎక్కువగా కనిపించే కారణాలలో ఇది ఒకటి. ప్రతి పదిమంది బాధితుల్లో ఎనిమిది మంది దీనికారణంగానే నడుం నొప్పికి గురవుతున్నారు.

ఏదైనా దెబ్బతగిలినప్పుడు మొదలై, శ్వాసపీల్చినప్పుడల్లా, కదలినప్పుడల్లా ఎక్కువగా అనిపించే నొప్పి పక్కటెముక విరగడం వల్ల కాని, లేకపోతే వెన్నెముకలోని ఎముకలు దెబ్బతినడం వల్ల కాని కావచ్చు.

షూలేసులు ముడి వేసుకునేటప్పుడో, మంచ మీద ఒక పక్క నుంచి మరో పక్కకు తిరిగుతున్నప్పుడో ఇటువంటి చిన్న చిన్న కదలికల సమయంలో ప్రారంభమయ్యే నొప్పి వెన్నుపూస (డిస్క్) జరగడం లేదా వెన్నెముకలో కీలు సమస్య వల్ల గాని కావచ్చు.

ఛాతీ చుట్టు పక్కల వరకు చొచ్చుకు వచ్చే తీవ్రమైన, నిరంతరమైన నొప్పి ఆస్టియో ఫోరోసిస్ లేదా ఎముకలు గుల్లబారడం వల్ల ఎముకలు దెబ్బతిని కావచ్చు.

మూత్ర విసర్జన సమయంలో నొప్పి, అసౌకర్యం, మూత్రంలో రక్తం పడటం మూత్రపిండాల్లో ఇన్ఫెక్షన్ వల్ల కావచ్చు.

నొప్పి వస్తూ పోతూ ఉండటం, ఒకోసారి అది కటి ప్రదేశం వరకు వ్యాపించడం మూత్రపిండాల్లో రాళ్ళ వల్ల కావచ్చు.

వెన్ను మధ్యభాగంలో నొప్పిగా ఉండడం, ఏదైనా తిన్నప్పుడల్లా అది తీవ్రం కావడం, అజీర్తి, జీర్ణకోశ అల్సర్ వల్ల కావచ్చు.

ఎక్కువ శ్రమతో కూడిన వ్యాయామాల అనంతరం వచ్చే నొప్పికి కండరాలు దెబ్బతినడం లేదా ఒత్తిడికి గురి కావడం కారణం కావచ్చు.

కదిలినప్పుడు లేదా చలిగా ఉన్నప్పుడు ఉధృతమయ్యే సాధారణ వెన్ను నొప్పి వెన్నెముకలో కీళ్ళవాతాన్ని సూచిస్తుంది.

డాక్టర్ సలహాలు

నా వయస్సు 20 సంవత్సరాలు. నాది ఎవరికీ చెప్పుకోలేని సమస్య. నాకు మూడు సంవత్సరాల క్రితం తామర వ్యాధి వచ్చింది. తామర అని తెలియక అజ్ఞానం వల్ల నిర్లక్ష్యం చేశాను. ఏవో కొన్ని మందులు, ఆయింట్‌మెంట్‌లు వాడినా తాత్కాలిక ఉపశమనమే లభించింది. తొడల ప్రాంతం, పిరుదులు అంతా నల్లగా మచ్చపడిపోయింది. ఈ నలుపు 6, 7 నెలల్లో తగ్గుతుందని ఎదురు చూశాను. కానీ ఫలితం శూన్యం. పీరియడ్స్ టైంలో బాగా దురద వస్తుంది. నలుపు పూర్తిగా తగ్గిపోయేటట్లుగా ఒక ఆయింట్‌మెంట్ రాయగలరు. శాశ్వత పరిష్కారం చూపగలరు. ప్లీజ్.

-కృష్ణవేణి, కొమరోలు

మీకు వచ్చింది తామర అంటున్నారు. అది మరల మరల వస్తూ ఉంటుంది. కాని దానివల్ల నల్లగా మచ్చ పడిందంటున్నారు. కాబట్టి ఆ మచ్చ తగ్గటానికి మాత్రం Melalite అనే క్రీమును ఉదయం, సాయంత్రం కొన్ని నెలల పాటు పెడితే ఫలితం ఉంటుంది. పీరియడ్స్ టైమ్‌లో ఇంకా దురద వస్తుందన్నారు. దీనికి మీరు చర్మరోగ నిపుణుని సంప్రదించాల్సి వుంటుంది.

- డాక్టర్ జి.ఎస్.కె.శేఖర్,

హైదరాబాద్



వెన్ను దిగువ భాగం

పక్కకు తిరిగినప్పుడో, వంగినప్పుడో లేక ఏదైనా వస్తువును ఎత్తినప్పుడో మరేదైనా చిన్నపాటి కదలిక తరువాతో వెంటనే మీ వెన్ను దిగువ భాగంలో నొప్పి మొదలైందా? అది స్లిప్/ప్రొలాప్స్‌డ్ డిస్క్ కారణంగా కావచ్చు.

వెన్ను నొప్పికి తోడు మీ కాళ్ళు రెండూగాని, ఒకటి గాని నొప్పిగా ఉండి వ్యాయామం చేసినప్పుడు ఉపశమనంగా అనిపిస్తే మీరు యాంకిలోజింగ్ స్పాండిలైటిస్‌తో బాధపడుతున్నట్లే లెక్క. ఈ పరిస్థితిలో

(మిగతా 23వ పేజీలో)

"క్రికెట్... క్రికెట్..."

అంపశయ్య నవీన్

"ఈ మధ్య మన క్రికెట్ వీరులు చాలా బాగా ఆడుతున్నట్టున్నారే! ఇంచుమించు గెలవటం అసాధ్యం అనుకున్న మ్యాచెస్‌ని కూడా గెల్చేస్తున్నారు. ఇంగ్లండ్‌లో జరిగిన ఓమ్యాచ్‌లో మన వాళ్ళు గెలవాలంటే 326 పరుగులు చెయ్యాలి. అందులో కనీసం వంద పరుగులు కూడా చెయ్యకుండానే సచిన్ టెండూల్కర్‌తో సహా మన ఐదుగురు బ్యాట్స్‌మన్ అవుటయిపోయారు. మన క్రికెట్ అభిమానులందరూ ఇండియా ఈ మ్యాచ్ ఓడిపోవడం ఖాయం అనుకొని టీవీలు కట్టేసి వేరే పనులు చూసుకోసాగారు. అలాంటి సమయంలో యువరాజ్‌సింగ్, మహ్మద్ కైఫ్ అనే ఇద్దరు వీరులు అత్యద్భుతంగా ఆడి మూడువందల ఇరవై ఆరు పరుగులు చేసేసి భారత్‌ను గెలిపించారు. అదే ఒక మహాద్భుతం అనుకుంటే మనవాళ్ళు మొన్న శ్రీలంకలో మరో మహాద్భుతాన్ని సృష్టించారు. ఛాంపియన్స్ ట్రోఫీ కోసం జరిగిన సెమీ ఫైనల్ మ్యాచ్‌లో సౌతాఫ్రికాను ఓడించడమే ఆ మహాద్భుతం. క్రికెట్ ఆడుతున్న దేశాలన్నీ ఈ ఛాంపియన్స్ ట్రోఫీ కోసం పోటీ పడ్డాయి. క్రికెట్ పరిశీలకులందరూ సౌతాఫ్రికా, ఆస్ట్రేలియా ఫైనల్‌కొస్తాయనుకున్నారు. అయితే సౌతాఫ్రికాలో జరిగిన మొదటి సెమీఫైనల్‌లో ఇండియా సౌతాఫ్రికాతో తలపడింది. చివరి ఐదు ఓవర్ల వరకూ అందరూ సౌతాఫ్రికా గెలవడం ఖాయమనుకున్నారు. కాని చివరి ఐదు ఓవర్లలో మ్యాచ్ ఎవ్వరూ ఊహించని విధంగా ఇండియా వైపు మళ్లింది. చేతిలో వికెట్లు ఉన్నప్పటికీ సౌతాఫ్రికన్ బ్యాట్స్‌మెన్ విజయం కోసం చెయ్యవలసినన్ని పరుగులు చెయ్యలేకపోయారు. వాళ్ళ బ్యాట్స్‌మెన్‌ని పరుగులు చెయ్యనీయకుండా మన బౌలర్లు కట్టడి చెయ్యగలిగారు. దాంతో పది పరుగుల తేడాతో సౌతాఫ్రికా ఓడిపోవడం, ఇండియా గెలవడం జరిగింది. అసలు వర్షం వచ్చి పాడు చేసింది గానీ లేకపోతే ఫైనల్లో కూడా మనవాళ్ళే శ్రీలంకను ఓడించి ఛాంపియన్ ట్రోఫీ గెల్చేవాళ్లే. మీరెప్పుడూ ఇండియా ఓ క్రికెట్ మ్యాచ్ గెలిస్తేనే ఆశ్చర్యపడాలిగానీ ఓడిపోతే ఆశ్చర్యపడొద్దు అంటుంటారు కదా. ముఖ్యంగా మన దేశంలో ఆడినప్పుడు గెలుస్తారే తప్ప విదేశాల్లో మనవాళ్ళెప్పుడూ గెలవరని కూడా అంటుంటారు కదా... ఈ రెండు మహాద్భుతమైన విజయాలు ఇండియాకు విదేశాల్లోనే లభించాయి గదా! వీటిని గురించి మీరేమంటారు?" అన్నాడు హనుమంతరావు. ఈ హనుమంతరావు నేను పని చేసిన కాలేజీలోనే ఫిజికల్ డైరెక్టర్‌గా పని చేశాడు. ఆయనకు క్రికెట్ అంటే చాలా అభిమానం. క్రికెట్‌కు సంబంధించిన వివరాలన్నీ ఆయన ఫింగర్ టిప్స్ మీదుంటాయి. ఆయన నా దగ్గరకెప్పుడొచ్చినా క్రికెట్ గురించే మాట్లాడతాడు.

"నిజమే – ఈమధ్య మనవాళ్ళు క్రికెట్‌లో ఎవ్వరూ ఊహించడానిక్కూడా సాహసించని అద్భుత విజయాల్ని సాధించారు. ఇదివరకు మన క్రికెట్ టీం ఒక మ్యాచ్ బాగా ఆడితే ఆ తర్వాత జరిగే రెండు మ్యాచ్‌లు చెత్తగా ఆడి చిత్తుగా ఓడిపోతుండే వాళ్ళు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి మారిపోయినట్టనిపిస్తోంది. మీరన్న ఆ రెండు మ్యాచ్‌ల్లోనూ సచిన్ టెండూల్కర్ పెద్దగా ఆడలేదు. ఇదివరకు సచిన్ బాగా ఆడితేనే ఇండియా గెలుస్తుంది. లేకపోతే ఓడిపోతుంది అనుకునే వాళ్ళు. కేవలం ఒక్క క్రీడాకారుడి మీదే మొత్తం టీం ఆధారపడటం అంత ఆరోగ్యకరమైన లక్షణం కాదనుకునే వాళ్ళం. కానీ ఇప్పుడు సచిన్ ఆడకపోయినా ఇండియా చాలా అద్భుతమైన విజయాల్ని సాధిస్తున్నది. అందుక్కారణం ఈ మధ్యనే భారత జట్టులో ప్రవేశించిన నల్గురు యువ క్రీడాకారులు అద్భుతమైన ప్రతిభ కనబరచటమే. ఆ నలుగురు వీరేంద్ర సెహవాగ్,

యువరాజ్‌సింగ్, మహ్మద్ కైఫ్, జహీర్‌ఖాన్. మ్యాచ్ ప్రారంభ ఓవర్లలో సెహవాగ్ తన బ్యాట్‌తో వీరవిహారం చేస్తూ పరుగుల వర్షం కురిపిస్తున్నాడు. మిడిల్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్‌గా వస్తున్న యువరాజ్‌సింగ్, మహ్మద్‌కైఫ్‌లు చాలా నిలకడగా ఆడుతూ ఇండియన్ బ్యాటింగ్‌కు ఇదివరకెన్నడూ లేని స్థిరత్వాన్ని కల్పిస్తున్నారు. ఇదివరకు ఇండియన్ మిడిల్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్ ఘోరంగా విఫలమవుతుండేవాళ్లు. ఇక బౌలర్స్ విషయానికొస్తే జహీర్‌ఖాన్ మ్యాచ్ ప్రారంభంలోనూ, చివర్లోనూ చాలా గొప్పగా బౌల్ చేసి వికెట్లు పడగొడుతున్నాడు. వీళ్ళకుతోడు ఎంతో అనుభవజ్ఞుడూ, మిస్టర్ డిపెండబుల్ అని పేరు తెచ్చుకున్న రాహుల్ ద్రావిడ్ కూడా కష్ట సమయంలో ఇండియన్ టీంకు కొండంత అండగా నిలుస్తున్నాడు. వీళ్ళకు తోడు సౌరవ్‌గంగూలీ కెప్టెన్సీ గురించి కూడా చెప్పుకోవాలి. ఇదివరకు ఏ ఇండియన్ కెప్టెన్‌లో కూడా క్రికెట్ ఆడుతున్నప్పుడు ప్రత్యర్థి టీంను ఓడించితీరాలన్న తీవ్రమైన పట్టుదల కనిపించేది కాదు. అది సౌరవ్‌గంగూలీలో కనిపిస్తున్నది. దీన్నే క్రికెట్ పరిశీలకులు "కిల్లర్ ఇన్‌స్టింక్ట్" అంటుంటారు. ఏ ఆస్ట్రేలియా టీంలోనో, సౌతాఫ్రికా టీంలోనో కనిపించే కిల్లర్ ఇన్‌స్టింక్ట్ ఇప్పుడు ఇండియన్ టీంల్లో కూడా కనిపిస్తున్నది. కొన్నిసార్లు సౌరవ్‌లోని ఈ కిల్లర్ ఇన్‌స్టింక్ట్ మరీ ఎప్పుడూ గెలవాలన్న ఉత్సాహాన్ని తరిగిపోకుండా కాపాడాలంటే ఇలాంటి కెప్టెన్సీ అవసరమే" అన్నాన్నేను.

"మొత్తానికి మీరు కూడా ఇండియన్ క్రికెట్ టీంను ఇంతగా మెచ్చుకున్నారంటే నాకు ఈసారి మనవాళ్ళు 2003లో జరగబోతున్న వరల్డ్ కప్ గెలుచుకొస్తారనిపిస్తున్నది" అన్నాడు హనుమంతరావు.

"వరల్డ్‌కప్ గెలిచినా గెలవకపోయినా మన క్రికెట్ టీం ఇప్పుడు బావుందనేది నిర్వివాదాంశం. నేను మన క్రికెట్ టీంను మరొకందుక్కూడా మెచ్చుకుంటాను. అదేమిటంటే విచ్ఛిన్న శక్తులు పెరిగిపోతున్న ఈ తరుణంలో మనదేశ సమైక్యతను కాపాడే బలమైన శక్తుల్లో మన క్రికెట్ టీం ఒకటి. మన దేశానికి వేరే ఏ క్రీడల్లో కూడా ప్రపంచ స్థాయిలో పోటీ చేసి గెలిచే స్తోమత కనిపించడం లేదు. ఒక్క క్రికెట్ ఆటలోనే మనకా అవకాశం ఉంది. మన దేశంలో మరే ఇతర ఆటకూ లేనంత ప్రేక్షకాదరణ క్రికెట్‌కుంది. మన క్రికెట్ టీం ప్రపంచంలో ఎక్కడ, ఏ దేశంతో క్రికెట్ ఆడుతున్నా దేశ ప్రజలంతా గొప్ప ఉత్సాహంతో టీవీల ముందు కూర్చొని చూస్తారు. మనదేశం గెలవాలని ఆకాంక్షిస్తారు. అది కాశ్మీర్ కావొచ్చు, కేరళ కావొచ్చు.... మణిపూర్ కావచ్చు.. మధ్యప్రదేశ్ కావచ్చు.. అలాగే క్రికెట్ చూసే ప్రేక్షకులు హిందువులు కావచ్చు.. ముస్లిమ్‌లు కావచ్చు..క్రిస్టియన్లు కావచ్చు... సిక్కులు కావచ్చు.. అగ్రకులాల వాళ్ళు కావచ్చు. కింది కులాల వాళ్ళు కావచ్చు.. బాగా డబ్బున్న వాళ్ళు కావచ్చు.. అందరూ తరతమ భేదాలన్నీ మరచిపోయి మన క్రికెట్ టీం గెలవాలని హృదయ పూర్వకంగా కోరుకుంటారు. ఇలా మన దేశంలో ప్రజలందర్నీ సమైక్యం చేస్తున్న ఓ బలమైన శక్తి క్రికెట్ అని ఒప్పుకోకతప్పదు.. ప్రపంచంలో క్రికెట్ ఆడే దేశాల్లోని ఏ దేశంలో కూడా క్రికెట్ పట్ల మన దేశ ప్రజలకున్నంత మోజు, ఆదరణ లేవు. అది ఒకరోజు మ్యాచ్ కావచ్చు... ఐదు రోజుల మ్యాచ్ కావచ్చు.. మన దేశంలో ఒక అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్ జరుగుతోందంటే చాలు... స్టేడియం నిండిపోతుంది. కొన్నిసార్లు తొక్కిసలాట జరుగుతుంది. మన దేశం ప్రజలకు క్రికెట్ పట్ల ఉన్న ఈ విపరీతమైన మోజు కారణంగా ఇవ్వాళ్ళ మన దేశ క్రికెట్ ఒక పెద్ద పరిశ్రమగా మారిపోయింది. ప్రతి సంవత్సరం మన దేశ క్రికెట్ మీద బహుళ జాతి సంస్థలైతేనేం, ఇతర భారీ ప్రైవేట్ సంస్థలైతేనేం వెయ్యి కోట్ల రూపాయల్ని పెట్టుబడిగా పెడ్తున్నాయట. అడ్వర్టయిజ్‌మెంట్ల రూపంలో పెద్ద పెద్ద కార్పొరేట్ కంపెనీలు వందల కోట్ల రూపాయల్ని ఖర్చు చేస్తున్నాయి. అలాగే ఎక్కువ పరుగులు, సెంచరీలు చేసిన సచిన్ టెండూల్కర్‌లాంటి వాడిచేత ఫలానా వస్తువును వాడండి అని చెప్పించడానికి అతనికి కోట్ల కొద్దీ రూపాయలిస్తున్నారు. షారూక్‌ఖాన్, అమితాబ్ బచ్చన్, అమీర్‌ఖాన్, మాధురీ దీక్షిత్‌లాంటి సినిమా తారల కంటే సచిన్ టెండూల్కర్ అంటేనే ప్రజలు ఎక్కువ ఇష్టపడుతున్నారట! అందుకే సచిన్‌చేత ఫలానా వస్తువు వాడండి అని చెప్పిస్తే దాని ప్రభావం ఓ సినిమాస్టార్ చెప్పిందానికంటే చాలా ఎక్కువగా ఉంటున్నదట. ఈ కారణం చేత ఇవ్వాళ్ళ క్రికెట్ ఆటలో పేరు తెచ్చుకుంటున్న వాళ్ళు క్షణాల్లో కోటీశ్వరులైపోతున్నారు. ఇదంత ఆరోగ్యకరమైన పరిస్థితి కాకపోయినా పరిస్థితులలా వున్నాయి " అన్నాన్నేను. ★

ఆర్ట్ గ్యాలరీ



చుక్కలు కలిపి రంగులు వేయండి

పైన వున్న చుక్కలు కలిపితే ఓ జంతువుబొమ్మ వస్తుంది. అది ఆఫ్రికాలో నివశిస్తుంది. మరి ఆలస్యమెందుకు..!

తలచుకున్న సంఖ్య

మీ మిత్రుడిని మనసులో ఓ అంకె అనుకోమనండి. అదేంటో చెప్పండి. 'ఏంటి మా దగ్గరేమన్నా మంత్రాలున్నాయా? వాడు మనసులో అనుకున్న అంకెను మేమెలా చెప్తాం? అదెలా సాధ్యం? ఆ విషయం మనకెలా తెలుస్తుంది!' అని ఆశ్చర్యపోతున్నారా? చిటికెలో కనిపెట్టవచ్చు. అదెలాగంటే - మీ స్నేహితుడిని ఓ అంకె తలచుకోమనండి. దాన్ని రెండు పెట్టి గుణించి, తర్వాత 2 కలపమనండి. మరలా 5తో గుణించి, ఆపై 5 కలపమనండి. ఆపై 10తో గుణించి, 10 కలపమనండి. ఆన్సర్ ఎంత వచ్చిందో అడగండి. ఆ సంఖ్యలో మూడంకెలుంటాయి. వందల స్థానంలో వున్న అంకెలోంచి ఒకటి తీసేసి 'అదే నువ్వు తలచుకున్న సంఖ్య' అని చెప్పి ఆశ్చర్యపరచండి. ఏంటి ఇప్పటికైనా నమ్ముతున్నారా? లేదా? సరే. ఉదాహరణకి మీ స్నేహితుడు తలచుకున్న సంఖ్య 6 అనుకోండి.

2తో గుణిస్తే... 2 × 6 = 12 , 12కి 2 కలిపితే 12+2= 14

5తో గుణిస్తే... 5×14=70, 70కి 5 కలిపితే 70+5= 75

10తో గుణిస్తే ...10×75= 750, 10 కలిపితే 750+10= 760

760లో చివర వున్న అరవై వదిలేసి వందల స్థానంలో వున్న 7 తీసుకోండి. దాంట్లోంచి 1 తీసేయండి. 7-1=6. ఇదే మీ స్నేహితుడు తలచుకున్న సంఖ్య. మరి ఇదే పద్ధతిలో మీ ఫ్రెండ్స్‌ను అడిగి, వారు తలచుకున్న సంఖ్య చెప్పి ఆశ్చర్యపరుస్తారా!

-బట్టా రామకృష్ణ, నెల్లూరు.

క్విజ్-27

1.ఢిల్లీ ఏ నది ఒడ్డున వుంది?

ఎ.గంగ బి.యమున

2.'ఆదికవి' అనే బిరుదు ఎవరికి వుంది?

ఎ. తిక్కన బి. నన్నయ్య

3.'కన్యాశుల్కం' నాటకం రచించిందెవరు?

ఎ.గురజాడ అప్పారావు బి.గుర్రం జాషువా

4.ఆగ్రా ఏ రాష్ట్రంలో వుంది?

ఎ. ఉత్తరప్రదేశ్ బి. మధ్యప్రదేశ్

5.ఐక్యరాజ్య సమితి దినోత్సవం ఎప్పుడు జరుపుకుంటాం?

ఎ.అక్టోబర్ 24 బి.అక్టోబర్ 25

6. మన జాతీయ చిహ్నంలో ఎన్ని సింహాలుంటాయి?

ఎ.మూడు బి.నాలుగు

7.పట్టుపురుగుల పెంపకాన్ని అధ్యయనం చేసే శాస్త్రం ఏది?

ఎ. ఆక్వా కల్చర్ బి.సెరి కల్చర్

8. అయస్కాంతంచే ఆకర్షించబడనిది?

ఎ.ఇనుము బి.కాయితం

9. భారత చలన చిత్ర పితామహుడు

ఎ. దాదాసాహెబ్ ఫాల్కే బి. బి.ఎన్.రెడ్డి

10. ఈ ఫొటోలోని వ్యక్తి ఎవరో కనుక్కోండి ?

ఎ.ముషరఫ్ బి. బుష్

శుభ్రం తెలియని దేవత!

నసీరుద్దీన్‌కి ఓసారి ఏదైనా పట్టణం చూద్దామనిపించింది. అనిపించినదే తడవుగా ప్రయాణమయ్యాడు. అక్కడి అద్భుత భవనాలను చూచి ఆశ్చర్యపోయాడు. ఉత్సాహంగా వీధులన్నీ తిరుగుతూ పట్టణాన్ని చూస్తున్నాడు నసీరుద్దీన్. ఈయనిలా ఆశ్చర్యంగా తిరగడాన్ని కొందరు పట్టణవాసులు చూశారు. వారికి ఆయన్ను ఆటపట్టించాలనిపించింది. 'పల్లెటూరిబైతు వచ్చాడురోయ్... ఓ చూపు చూద్దామా' అని అందరూ కూడబలుక్కున్నారు. వెంటనే నసీరుద్దీన్‌ని పిలిచి విచిత్రంగా కళ్లెగరేస్తూ....'ఏంటి... ఏం చూస్తున్నావ్' అనడిగారు. నసీరుద్దీన్ ఓ భవనాన్ని, దాని మీద గొడుగులా విస్తరించిన మర్రి వృక్షాన్ని చూపించి...'ఏమిటిది?' అనడిగాడు అమాయకంగా.

దానికి వాళ్లు పెద్దగా నవ్వి 'నీకు తెలీదా... మేం పూజించే అమ్మవారు. జడలు విరబోసుకుంది' అన్నారు.

కచ్చితంగా అప్పుడే ఆ భవనంమీద కొందరు సైనికులు పహారా తిరుగుతూ కనిపించారు నసీరుద్దీన్‌కి. అంతే... 'ఏంటీ మీ అమ్మవారికి శుభ్రం తెలీనట్టుందే. పేలు చూడండి ఎట్లా తిరుగుతున్నాయో' అన్నాడు ఇంకా అమాయకంగా.

రుక్మిణి

జక్కులోడు ముందు మాత్రం సొమ్మసిల్లి పడబోయి నెమ్మదిగా తేరుకున్నాడు. కళ్ళు నులుముకుని, ఇది కలా? నిజమా? అని తన చెవిని తానే నులుముకుని కెవ్వుమన్నాడు. నిజమే!

జక్కులోడి భార్య బాసింపీటేసుకుని, కండ్లు మూసుకుని, ఒకసారి చేతులు ముందుకు బారజాపుతూ, మరోసారి తలమీద నుండి నిటారుగా పైకీ - కిందికీ ఎత్తి లయబద్ధంగా దించుతుంది. శ్వాసబాగా లోపలికి ఎగబీకడం... సన్నపాము బుసలా 'బుస్సు' మని వదలడం... అంతా చాలా గమ్మత్తుగా... వివిధ భంగిమల్లో, రీతుల్లో కానిచ్చేస్తుంటే బిత్తరపోవడం జక్కులోడి వంతయ్యింది. 'ఇదెక్కడి పీకులాట ఆటరా... ఇదే రకం మాయదారి జబ్బురా మగడా' అని అటూ ఇటూ చిందులు తొక్కాడు - ఇంకా చిత్రం! పూర్తి తెల్ల బట్టలు గట్టుకుని కానిచ్చేస్తుంది.

"ఏందే ఇదీ... ఏంటి కథా...? అవతల అన్నం వండేది లేదా? వార్నీ... డబ్బాలో బియ్యం పూరాగా అయిపోయినైగద! గోవిందా! ఛీ.. ఛీ... వెధవ సంసారం... వెధవ బతుకు". జక్కులోడు బొబ్బరింతలు మొదలు పెట్టగానే ఆవిడగారు శాంతంగా కండ్లు తెరిచింది!

"అదే వద్దన్నది! అవతల చంద్రబాబుగారు మా ఆడోళ్ళందరికీ 'బతికే కళ' అని ట్రయినింగులిప్పిస్తండు - అబ్బో...! ఆ 'రహస్యం' గానీ తెలుసుకున్నామంటే ఇగ బతుకంతా పండగే"!

జక్కులోడు నోరు వెళ్ళబెట్టాడు- 'బతికేకళ' - ఇదేందీ?

"అంటే ఇవ్వాళ అన్నం గిన్నం వండే ఉపాయం లేదన్నట్లేనా? ఓర్నీ... ఇదెక్కడి యవ్వారం! సర్సరె... డబ్బాల బియ్యం లేవు... నాకాడ పావలా డబ్బుల్లేవు. అవతల కిరాణం దుకాణం కనకయ్య కనబడంగనే బాకీ కడ్తవా... సస్తవా అని గోల...!"

"శాంతి! 'బతకటం ఒక కళ', ప్రతి ఒక్కదాన్నీ పెద్ద సమస్య చేసుకోవద్దు. అన్నీ అనుకూలం చేసుకుని ఆనందంగా బతకాలె"

"ఏందే... కడుపు మాడిపోతుంటే ఆకలిని అనుకూలం చేసుకోటమా? గదేందీ? ఆకలి అనుకూలం ఏందే? దాని పని దాన్దేగదా? అవతల కిరాణం దుకాణం..

"డబ్బు సంపాదించడం గురించి ఆలోచన్లు చేయడం పాపం! అది చాలా పాపిష్టిది - తృప్తి గొప్పది.. డబ్బు బతుకులన్నిటిని ఖరాబు చేసి - బికారుల్ని చేసి పారేస్తది.. శాంతి లేకుండా చేస్తది...

జక్కులోడు ఒంటినిండా చీమలూ... జెర్రులూ... ఇతర కీటకాలు పాకినట్లు చిందర వందరగా చిందులేశాడు-

"పాపిష్టిదా... డబ్బు పాపమా? వార్నీ... ఇన్ని రోజుల్నుండి గీ మహాభారతమంత మతలబు నాకు తెలవకపాయె! ఆగాడు... ఒంటిమీద రెండు చెంబుల నీళ్ళు పోసుకుని వచ్చి మాట్లాడతా... మంట లేచిపోతుంది-!" అని ఆగం ఆగంగా జక్కులోడు తడికెల చాటుకుపోయి పెడబొబ్బలు పెట్టాడు.-'

"ఏందే... ఇదేందీ? గోలెంలో చెంబుడు నీళ్ళు కూడా లేవు.... అరె... సుక్కనీళ్ళు కూడా లేవు గద...ఏంది కథ!" అని అరుచుకుంటూ దూకుడుగా

ఆర్ట్ ఆఫ్ లివింగ్ అను చేపల పులుసు

ఇంట్లోకి వచ్చిపడ్డాడు!

"అది 'మిధ్య'-నీళ్ళు లేవూ అంటే లేవు... ఉన్నై అనుకుంటే అంతా పుణ్యం. అసలు స్వర్గం - నరకం గురించి ఆలోచన లేకుండా ఈ బియ్యం - నీళ్ళు - కరంటు ఆకలీ... ఈ పాపపు ఆలోచన్లు పూరాగా మానుకుంటే అంతా ప్రశాంతం! 'బతికే కళ'లోనే అన్నీ పొందవచ్చు!"

ముందు జక్కులోడు జుట్టు పీక్కున్నాడు. తర్వాత దీనికి 'గాలి' గాని సోకిందా అని అనుమాన పడ్డాడు - కొంపదీసి చాతబడేమో... కావచ్చు! తర్వాత అసలు దీని యవ్వారమేదో తేల్చుకోవాలని శాంతించాడు?

"సర్సరెగానీ... ఆకలీ... నీళ్ళూ.. ఆలోచించడం మానేసి 'స్వర్గం' గురించే ఆలోచన చేయమంటావు.

"అంతేగద! అదే ముక్తికి మార్గం!"

"సర్సెరె... మరి నువ్వూ నేనూ ఇద్దరమేనా... ముక్తి మనిద్దరికేనా... ఆ పక్క బజారులో పదిమేడలు కట్టిన యమ్మెల్లేగారు... కొత్త కారేసుకుని జోరుగ తిరిగే మన మంత్రిగారు కూడానా..

"అందరూ గట్లనే ఆలోచించాలె.. తప్పదు!"

"బాగుంది. ఆలోచించి ఆకలికి నకనకలాడి నక్కపేగులేసుకుని పక్కేసుకుని నేను పడుకుంటా... అవతల వాడు మేడమీద మరోమేడ లేపుకుంటాడు - వాడికీ స్వర్గమే... నా ఆలోచనా ముక్తీ స్వర్గమేనా? వాడికక్కర్లేని స్వర్గం నాకు మాత్రం ఎందుకే?"

"పాపం... ప్రశాంతంగుండాలె... అదుగో అన్నీ అట్లాంటి 'వ్యతిరేకపు' ఆలోచన్లు చేయొద్దు.. వ్యతిరేకం వద్దే వద్దు"!

"అట్లనా... బాబుగారి బోధనలేనా తల్లీ ఇవి... హమ్మో.. అద్సరె గానీ.. మరి ఎండిపోతున్న పంట పొలాలు... నీళ్లలేకపోటం... కరంటు మోటార్లు కాలిపోటం... రైతులు లబోదిబోమని కరంటాఫీసుల మీదికి ఎగబట్టటం... అవేం వద్దా-

"అవన్నీ 'వ్యతిరేకం' ఆలోచన్లు... కండ్లు, ముక్కు మూసుకుని రోజుకు మూడుసార్లు ముక్కిమూలిగితే అన్నీ మాయం... శాంతి... పైన దేవుడు...స్వర్గం...!"

"ఇక్కడ బాబుగారు.. వేదాంతం చెప్తున్నారు-చాలాబాగుంది. అద్సరెగానీ.. అవతల ప్రపంచ బ్యాంకోడు ముక్కుమీద గుద్ది ఈ అప్పు యాభై వేలకోట్లు... దాని వడ్డీ సంగతడిగితే... అదంతా ఈ 'అనుకూల' ఆలోచన చేసి 'స్వర్గం' చూపించి ఊర్కోమంటే వూరుకుంటడా? నీరు.. కరంటు లేక జనం అల్లాడుతుంటే దానికిదామంత్రం... నీ మంత్రం నువ్వుచదువుకో... నేను యాద్గిరింటికాడ్నో... మల్లేశుగాడింటి కాడ్నో రెండు ముద్దలు తినివస్త" జక్కులోడు విసవిస బయటపడ్డాడు-

"ఏందయ్యో... బాగనే వుంది! రెండు కిలోల బియ్యావో... నూకలో పట్కరా-గా రెడ్డోరి వోటబావిల అడుగునీ నీళ్ళూరుతయి - గంటకూకునైనా నాలుగు బిందెలు పట్కరా... పోరగాండ్లు ఆకలికి సస్తరు"!

★ ★ ★

ముదుసుకుని పడుకున్న భార్యను జక్కులోడు లేపాడు.. ఆవిడ 'గయ్యి'మని లేచి అంతదూరం ఓ గెంతు గెంతి.. చెంగులో ముక్కు మూసుకుంది.

"ఛీ... యాక్... వాసన.. చేపల వాసన... గబ్బు.. గంతలావున చేపలు తిని చేతులు మూతి సరిగ్గ కడుక్కోవాల్నా... నీళ్ళు తెచ్చిన... కడుక్కో"నానా హంగామా చేసింది వాడి భార్య!

"ఒసి ఎర్రిమొహావా... ఇది చంద్రబాబుగారు చెప్పిన మంత్రమే. మాలాంటి ఎడ్డి సన్నాసులందరూ ఒక్కసారె బాగ తెలివి బారాలంటే చెడామడా చేపలు తినమని చెప్పిండు. మన రాష్ట్రం జనాలు మొత్తానికి మొత్తం తెలివి మీరి పోవాల్నంటే చేపల పులుసే అసలు కిటుకని బల్లగుద్ది చెప్పె! బెంగాలు వాండ్ల తెలివీ... వాటి మర్మం అంతా చేపలేనట! గా ఎండిన నీటి మడుగు నీళ్ళు గుప్పి యాద్గిరీ - మల్లేశూ, నేనూ వరక పిల్లలు దొరకబుచ్చుకుని... పులుసుబెట్టి... ★

ఆనంద విషాదాలు మిగిల్చిన బుసాన్

ఎం.డి. హసన్ షరీఫ్

అంగరంగ వైభవంగా 15 రోజులపాటు అభిమానులను అలరించిన 14వ ఆసియా క్రీడలు బుసాన్‌లో సోమవారం నాడు ముగిశాయి. ఆసియాకు చెందిన సభ్యదేశాలన్నీ తొలిసారిగా పాల్గొన్న ఈ చారిత్రాత్మక ఆసియాడ్ భారత్‌కు ఆనందంతో పాటు విషాదం కూడా మిగిల్చింది. గత ఆసియాడ్ కంటే ఈసారి భారత్ మెరుగైన ప్రతిభ కనబర్చి పతకాల పట్టికలో ఒక స్థానం పైకి ఎగబాకింది. దీంతో పాటు సునీతా రాణి డోపింగ్ టెస్ట్‌లో పట్టుబడి దేశ ప్రతిష్టను దిగజార్చింది. కామన్వెల్త్ క్రీడల హీరోలు ఇక్కడ జీరోలుగా మారడం బుసాన్ ఆసియాడ్ ప్రత్యేకత. అథ్లెటిక్స్‌లో క్రీడాకారులు (రిణులు) అనుకున్నట్లే రాణించగా, ఎన్నో ఆశలు పెట్టుకున్న షూటింగ్, వెయిట్‌లిఫ్టింగ్ ఆటగాళ్లు నిరాశ పర్చారు.

ఆసియా క్రీడల్లో భారత్ అథ్లెటిక్స్‌లో 1982 నుండీ కొన్ని ఈవెంట్లలో స్వర్ణాలను ఖాయం చేసుకుంటోంది. ముఖ్యంగా 1986లో పి.టి. ఉష ఏకంగా నాలుగు స్వర్ణాలు సాధించి మన దేశంలో కూడా ఉత్తమ అథ్లెట్లు ఉన్నారని నిరూపించింది. ఆ ఆసియాడ్‌లో ఉష ఉత్తమ అథ్లెట్‌గా నిలిచింది. ఈ క్రీడల్లో ఆమెను మరిపించే విధంగా ఏ అథ్లెటూ రాణించలేదు. అయితే బీనామోల్ మాత్రం తన స్థాయికి తగ్గ ప్రతిభ కనబర్చి రెండు స్వర్ణాలు, (మహిళల 800 మీటర్ల విభాగంలో ఒకటి, 4×400 మీటర్ల రిలే పరుగులో ఒకటి) ఒక రజితం సాధించింది. బీనామోల్ ప్రతిభ కారణంగా భారత్ పతకాల పట్టికలో గతంలో కంటే మెరుగైన స్థానం సంపాదించగలిగింది. మహిళా లాంగ్ జంప్‌లో అంజూ బి. జార్జ్, డిస్కస్ త్రోలో నీలం జె. సింగ్‌లు తమపై పెట్టిన ఆశలను వమ్ముచేయలేదు. వీరు తమ అత్యుత్తమ ప్రతిభను కనబర్చక పోయినప్పటికీ స్వర్ణం చేజిక్కించుకోవడం విశేషం. తమ కెరీర్ ఉత్తమ ప్రతిభను అంతర్జాతీయ వేదికలపై ప్రదర్శించేట్లు భారత అథ్లెట్లు ప్రయత్నించాలి. అప్పుడు



ఒలింపిక్స్‌లో కూడా పతకాలు సాధించడం సునాయాసమవుతుంది. పురుషుల విభాగంలో ఎక్కువగా ఆశలు పెట్టుకోనప్పటికీ బహదూర్ సింగ్ షాట్‌పుట్ స్వర్ణంతో సంతృప్తి పర్చాడు.

షూటింగ్, వెయిట్ లిఫ్టింగ్‌లలో నిరాశ

షూటింగ్‌లో గతంలో మాదిరిగానే ఈసారి కూడా చైనా, దక్షిణ కొరియా అథ్లెట్లు క్లీన్‌స్వీప్ చేశారు. ఎన్నో ఆశలతో బుసాన్ వెళ్లిన 'రాజీవ్ ఖేల్ రత్న' అభినవ్ బింద్రా రిక్త హస్తాలతో తిరుగుముఖం పట్టడం విచారకరం. ప్రపంచ షూటింగ్ టోర్నమెంట్‌లో ఛాంపియన్‌గా నిలిచిన బింద్రా ఇక్కడ కనీసం ఒక్క స్వర్ణమైనా సాధిస్తాడని అందరూ ఆశించారు. కానీ తీవ్ర ఒత్తిడికి గురవడం వల్లే అతను పతకాలు సాధించలేకపోయాడు. అతని వయస్సు ప్రస్తుతం 19 ఏళ్లు మాత్రమే. కాబట్టి రాబోయే ఆసియాడ్‌లో అతను పరిణతి చెందిన ఆటగాడిగా రాణిస్తాడని



భావించవచ్చు. అతను విదేశీ కోచ్ వద్ద శిక్షణ తీసుకున్నప్పటికీ ఒత్తిడి కారణంగానే గురి తప్పాడనే భావించాలి. అంజలీ భగవత్ మాత్రం ఒక రజత పతకంతో సంతృప్తి పర్చింది. జస్పాల్ రాణా 'పిస్టల్ కింగ్' కాలేకపోయాడు. వెయిట్ లిఫ్టర్లు కూడా కామన్వెల్త్ సంతోషాన్ని ఇక్కడ కొనసాగించలేకపోయారు. ముఖ్యంగా వెటరన్ కుంజారాణిపై ఎక్కువ ఆశలు పెట్టుకున్నారు. కామన్వెల్త్‌లో నాలుగు స్వర్ణాలతో ఆసియాడ్ ఆశలు చిగురింపజేసిన కుంజారాణి 'బరువు' చైనా అథ్లెట్ల ముందు దిగదుడుపే అయింది. వీరికి విదేశీ కోచ్‌తో అంతర్జాతీయ ప్రమాణాలతో శిక్షణ ఇప్పించినప్పుడే తర్వాతి పోటీల్లో ఆశలు పెట్టుకోవచ్చు. సిడ్నీ ఒలింపిక్ కాంస్య పతక విజేత కరణం మల్లేశ్వరి లేనిలోటు కొట్టొచ్చినట్లు కనబడింది.

టెన్నిస్‌పై పెట్టుకున్న ఆశలను ఆటగాళ్లు పూర్తిచేశారనే చెప్పవచ్చు. ముఖ్యంగా రెండోసారి విడిపోయిన లియాండర్ పేస్, మహేశ్ భూపతి ఇటీవల అంతర్జాతీయ పోటీల్లో వేరువేరు సహచరులతో ఆడారు. ఈ ఆసియాడ్‌లో మాత్రం కలిసి బరిలోకి దిగినా వీరి మధ్య గల మనస్పర్థల ప్రభావం ఆటపై పడుతుందని అందరూ భయపడ్డారు. కానీ తమ మధ్య గల స్పర్థల ప్రభావం ఆటపై పడబోదని ఇరువురూ నిరూపించారు.

ఏకాగ్రతతో ఆడితే తమ జోడీకి ఎదురే లేదని మరోసారి చాటిచెప్పారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో మనీషా మల్హోత్రాతో జోడీ కట్టిన భూపతి ఫైనల్లో కొరియా జోడీ చేతిలో ఓటమితో రజితం మాత్రమే సాధించగలిగాడు. ఈ జోడీ కలిసి మరిన్ని టోర్నమెంట్లు ఆడితే రాబోయే ఆసియాడ్‌లో స్వర్ణం సాధించే అవకాశాలున్నాయి. ఆంధ్రతేజం సానియా మీర్జా అతిపిన్న వయస్సులోనే ఉత్తమ ప్రతిభ కనబర్చింది. అనుభవజ్ఞుడైన లియాండర్ పేస్‌తో కలిసి ఆడిన మీర్జా కాంస్య పతకం సాధించడం విశేషమే. ఆమె భవిష్యత్తులో మరిన్ని పతకాలు తెస్తుందనడంలో సందేహం లేదు. ఆమె ఆటకు పదును పెడ్తే మహిళా విభాగంలో టాప్ టెన్నిస్ క్రీడాకారిణిని మనం ప్రపంచానికి అందించవచ్చు. కొన్ని వర్గాలకే పరిమితమైన స్నూకర్, బిలియర్డ్స్‌లో భారత్ గత ప్రభను నిలబెట్టుకుంది. స్నూకర్ డబుల్స్‌లో వెటరన్ యాసిన్ మర్చంట్, జాతీయ ఛాంపియన్ హబీబ్ రఫత్‌ల జోడీ స్వర్ణం సాధించగా, బిలియర్డ్స్ డబుల్స్‌లో అనుభవజ్ఞుడైన గీత్ సేథి, వర్ధమాన ఆటగాడు అలోక్ కుమార్‌ల జోడీ స్వర్ణాన్ని తృటిలో కోల్పోయింది. సింగిల్స్‌లో ప్రపంచ మాజీ ఛాంపియన్ యాసిన్ సెమీస్‌లో ఓడిపోయి కాంస్యంతో తృప్తిచెందడం బాధాకర విషయం. కబడ్డీలో భారత్‌కు ఎదురులేదని మరోసారి నిరూపితమైంది. గత మూడు ఆసియాడ్‌ల మాదిరి ఈసారి కూడా భారత ఆటగాళ్లకు ఏ దేశం నుండీ సరైన పోటీ ఎదురవలేదు.

భారత్ స్థానాన్ని 'దిగజార్చిన' సునీత

భారత్ పతకాల పట్టికలో గత ఆసియాడ్‌లో కంటే రెండు స్థానాలు పైకి ఎగబాకింది అని ఆనందంలో తేలియాడుతున్న అభిమానులను ఆసియా క్రీడల నిర్వాహకులు షాక్‌కు గురిచేశారు. డోపింగ్ పరీక్షలో సునీతా రాణి పట్టుబడిందని ప్రకటించారు. దీంతో ఆమె సాధించిన స్వర్ణ (1500 మీటర్ల పరుగులో), కాంస్య (5000 మీటర్ల పరుగులో) పతకాలను అధికారులు వెనక్కి తీసుకున్నారు. దీంతో భారత్ పతకాల పట్టికలో ఏడు నుండి ఎనిమిదో స్థానానికి దిగజారింది. గత ఆసియాడ్‌లో భారత్ తొమ్మిదో స్థానంలో నిలిచింది. కామన్వెల్త్ క్రీడల్లో కూడా వెయిట్ లిఫ్టర్ సతీషా రాయ్ పట్టుబడడంతో భారత్ ప్రతిష్ట దిగజారింది. దీంతో ఆసియాడ్‌కు వెళ్లే ఆటగాళ్లకు భారత్‌లో డోపింగ్ పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించారు. అయినా సునీత భారత అధికారులకు పట్టుబడకపోవడం గమనార్హం. డోపింగ్‌పై అంతర్జాతీయ ప్రమాణాలకు ధీటుగా దేశంలో పరికరాలు లేకపోవడం ఇందుకు కారణం. ఈ ఆసియాడ్‌లో డోపింగ్ పరీక్షలో పట్టుబడిన ఏకైక క్రీడాకారిణి సునీతా రాణి కావడం విశేషం. దీంతో ఇంత పకడ్బందీ వ్యూహంతో వెళ్లినా భారత్ ప్రతిష్టకు మచ్చ ఏర్పడింది. ★



సైదులు

శ్రీలత

సైదులు పేరు వినగానే "ఇదెక్కడా విన్లేదే" అనిపించింది. సైదు మొరటుగా ఉంటుంది. కాళ్ళు అరచేతులు పెద్దగా, మగవాళ్ళ చేతుల్లా బిరుసుగా ఉంటాయి. సగం బియ్యం సంచిని అమాంతం ఎత్తి పడేస్తుంది. నిండు పత్తి సంచి ఎత్తడం ఇంకా తేలిక కనుక ఒక గోడౌను నుండి ఒక గోడౌనుకు పత్తి సంచులు మోస్తుంది.

ఎవరైనా పరాచికమాడినా, తగాదాకు దిగినా గొంతు పెంచి నానా బూతులు తిడుతుంది. సైదు తిట్టే బూతులకు మగవాళ్ళే పక్కకు తప్పుకుంటారు. తన తిట్లకు అర్థం కానీ, సిగ్గుకానీ సైదు ఎరుగదు. ముఖాన్ని భీకరంగా మార్చి చేతులు ఊపుతూ తిడుతుంది. "ఆడపిల్లవ్ గాదూ? గట్ల మాట్లాడితే నీకు మనువొస్తదానే? మగడొస్తడానే?" అనెవరైనా అంటే...

."నాకు మొగుడు గావాలని కులుకుతలేను! నాకే పెండ్లొద్దు, మొగుడొద్దు! ఇంగోసారి గిట్ల నా మొగని మాటదీస్తె మర్యాద దక్కది. నీకు పని గిట్ల లేదా? నీ తాడు తెగ! నీవు ముండమొయ్య! నీ మొగుడు ఇంగోదానితోన లేశిపోను" అని తిడుతుంది తన అక్కసు తీరేంతవరకు!

చూసేవాళ్ళకు చాలా సార్లు అనిపిస్తుంది... సైదులో ఎందుకో ఎవరి మీదో తీర్చుకోలేని కసి ఉందనీ, దాన్నిలా వ్యక్తపరుస్తుందని!

"ఏంటికే సైదు మొగోళ్ళ మీనికి గట్లవోతవు! వాళ్ళ మీన గట్ల కచ్చగడతవూ?" అనడిగితే

"కచ్చ గట్టకంటే వాళ్ళు నాలక్కటి ఆడోళ్ళను బత్కనియ్యరే! నోరువెట్టుకోని బతుకుతుండ" అంటుంది చటుక్కున!

ఈ మధ్యనే సైదు వాళ్ళ అమ్మమ్మ వచ్చింది! విషయమేమిటని అడిగితే

"సైదు తల్లొచ్చిందమ్మ తోల్కపోనీకె! గిది వోనంటది .గది రమ్మంటది! నేను వోను నీ బిడ్డకు జెప్పు అంటది! నాతోన రమ్మను నీ మన్మరాల్ని అంటదది! ఎక్కడ దోస్తలేదు."

"చిన్నప్పట్నుంచి పెంచినవంటే తిండి, బట్టపెట్టినవ్! గిప్పుడు దానికి పెండ్లి జెయ్యలంటే నీకు చాతనయితదా? ఖర్చుల ఖర్చు మూడు నాలుగు వేలయితవి! మేమయితే జెయ్యము జూడు" అని మేనమామలు బెదిరిస్తుంద్రమ్మా అంది!

"ఏం అమ్మ దగ్గరకు ఎందుకెళ్ళదూ? అనడిగితే" "దానికి తల్లి మీన పగ ఉన్నది తల్లీ" అంది. బోలెడాశ్చర్యమేసింది!

"తల్లి మీద పగేవిటీ?" అడిగాను!

"ఏంజేతు తల్లీ! తల్లీబిడ్డలు మొగాలు కూడా జూస్కోరు. తల్లిని మాచాకలోళ్ళ పిల్లగానికిచ్చి పెండ్లిజేస్తిమి! వాళ్ళిద్దరికీ పడకపాయె! నా బిడ్డ మొగణ్ణిడిచిపెట్టె! అప్పటికే సైదును కడుపుతోటి ఉన్నది. నాకు వాని పిల్లలొద్దు అంటనని కడుపుపోనికే పసర్లు తాగింది. అంత్రాలు గట్టిచ్చుకున్నది. గీపిల్లది మొండిపానం సావకపాయె. ఇంగెట్లనో దీనమ్మ

...మ్మిదినెల్లు మోసి పిల్లను గని మొఖం జూడకపాయె! పాలు ఇయ్యకపాయె! మొగని మీద కోపాన్కి గీపిల్లను నాకాడ ఇడిసిపెట్టి ఇంగోడ్ని గుళ్ళో పెళ్ళి జేసుకోని ఎల్లిపాయె. దీనితండ్రి ఊకున్నడా వాడింగో ఆమెను జేసుకునే! గీ పిల్ల అందరుండి అనాథాయె! ఏంజేతు తల్లీ, తల్లిపాలకు పిల్లేడుస్తుంటే నేను రొమ్మి సై నాకు పాలువడ్డయి. గట్లే పిల్లను పెంచుకున్న. దీనికి చిన్నగున్నంగ పసిరికలు వచ్చి సచ్చిపోనీకె తయారయితే తురకదేవుడు "సైదులు" పేరు వెట్టి. బతికె" అన్నది.

తెలంగాణాలో హిందూ దేవతలు, ముస్లిం దేవతలు అనే విభాగం ఉండదు. మసమ్మ, పోశమ్మ తిరునాళ్ళకు ముస్లింలు కల్లుపోసి, కోళ్ళను, ఏటలను బలి ఇచ్చి పూజలు చేస్తారు. అలాగే హిందువులు పీర్లపండుగ, రంజాన్ పండుగలప్పుడు మసీదుకు చక్కెర సాంబ్రాణీ కడ్డీ వెలిగించి పూలదండులు వేసి 'పాతాలుచేసినం' అనుకుంటారు. పిల్లలు పుట్టకపోతే వీళ్ళు వాళ్ళ దేవుళ్ళ పేర్లు, వాళ్ళు వీళ్ళ దేవుళ్ళ పేర్లు పెట్టుకుంటామని మొక్కుకుంటారు. ఎవరి ఇష్టం వాళ్ళది. ఎవరి మొక్కుబళ్ళు వాళ్ళవి. మతం పేర పేద ప్రజల్లో తేడాలనేవి ఇంకా స్పష్టంగా లేవు. ఎప్పుడైనా ఎక్కడో దేశంలో హిందూ ముస్లిం తగాదాలు వచ్చినపుడు మాత్రం "మావోళ్ళను సంపిండ్రంట మీవోళ్ళు" అని చెప్పుకోవడమే, "మీరు, మేమూ చంపుకుందాం" అనే ఆలోచన రాదు! మతకలహాలు ధనవంతులకు మాత్రమే సొంతం! ఒకవేళ బడుగు వర్గాలను ఉసిగొలిపి లేదా డబ్బు ఆశ చూపి తగాదాలు పెంచవలసిందే గాని వాటంతట అవి ఏర్పడవు. కారణం అనాదిగా ఈ రెండు మతాలు కలిసి జీవించడం! ఒకర్ని ఒకరు "అన్నా వదినా మామా మామి" అని పిలుచుకుంటూ సహజీవనం చేస్తారు. అయితే పెళ్ళి విషయంలో కొద్దిగా మతాంశము గట్టి పట్టే పడుతుంది. వీళ్ళది ఒకే తత్వం! ఆకలి తత్వం! శ్రమతత్వం! వలసతత్వం! అంతే పటిష్టమైన మతతత్వం అంటూ ఉండదు. పంట చేతికొచ్చినపుడు "కందూరు" అనే పండుగ ఇరు మతాలు చేసుకుంటాయి. ఇరు మతాలు కలిసి భోం చేస్తాయి.

ఇంతకీ విషయం ఏమిటంటే తురకదేవుని పేరు పెడతానని సైదు అమ్మమ్మ మొక్కుకుంటే సైదు బ్రతికిందనే నమ్మకం అన్నమాట. బతికిన సైదు ఏం చేసిందంటే ఏం చేస్తుంది. అందరి ఆడపిల్లల్లాగే కాస్త నడక, మాట వచ్చాక మేనమామలూ, వాళ్ళ భార్యలూ, ముసలి అమ్మమ్మతో సహా కూలికెళితే, వాళ్ళ పిల్లలను ఆడిస్తూ ఉండేదట ఇంటిదగ్గర!

మేనమామ భార్యలు మేమొచ్చేసరికి పనులు చేసి పెట్టాలని పురమాయిస్తే చిన్ని చిన్ని కట్టెలు ఏరుకొచ్చి, ఊరంతా తిరిగి పేడపోగేసి పిడకలు కొట్టి ఎండిన పిడకల్తో రైలుబండి ఆట ఆడుకునేది! అది చాలా కష్టపడిపోతుందని ఎవరూ అనుకునే వాళ్ళుకాదు! ఎందుకంటే దాని వయసు పిల్లలందరూ చేసే పనే అదీ చేసిది. సైదు అమ్మమ్మ సమస్య ఎప్పుడొచ్చిందంటే సైదుకు ఆరేడు ఏళ్ళు వచ్చేదాకా ఎవరూ పట్టించుకోలేదు. పిల్లలను ఎల్‌కేజీలో వేసే వయసురాగానే తల్లితండ్రి స్కూలు వెతికి జాయిన్ చేసేందుకు తొందరపడినట్లు, ఇక్కడ కూలికి పంపేందుకు ఆత్రుత పడతారు. అలా పంపేపుడు కాస్త మంచి రైతును చూసుకుని కూలికి పంపుతారు.

స్కూల్లో స్టాండర్డ్ చూసినట్లే ఇక్కడా కూలిరేటు చూస్తారు. ఇక ఆ వయసు నుంచీ పిల్లలు పెద్దలకు ఆదాయమే! అందుకే సైదు మేనమామలకు చుట్టమయింది. అమ్మ తనకింకో కాపురం, పిల్లలూ ఉన్నా సైదును రమ్మని అడుగుతూనే ఉంది. ప్రతి ఏడు! దానికి సైదు ఒప్పుకోకపోవడమే సమస్య!

"ఏం సైదూ మీ అమ్మ దగ్గరకు పోతే పోలా? ఎంతైనా అమ్మకదా" అన్నాన్నేను.

''ఊకోమ్మా! నీవు గూడ్కంగ ఊరోళ్ళమాటలింటవు! అది నాకు అమ్మెట్లయితది! సన్నిచ్చిందా? తానం బోసిందా? నాకన్నిటికి మాయవ్వనే నేను మాయవ్వనిడిసిపోను" అంది కచ్చితంగా!

"పాపం తనెంతో ప్రేమతో వచ్చింది కదా" అన్నాన్నేను! గలగల నవ్వింది! ఎగతాళిగ నవ్వింది! జుట్టు విదిల్చి ముడికట్టుకుంటూ

"ప్రేమంటే ఏందమ్మా పైసలా?" అడిగింది!

"అదేమిటీ! ప్రేమకూ, పైసలకూ చాలా తేడా ఉంది" అన్నాను చిన్న పిల్లవు నీకు తెలియదు అనే ధోరణిలో!

"ఏం ఫర్కత్ ఉందమ్మా! నేను పుట్టినంక సచ్చిన్నో, బతికిన్నో సూడని మా నాయన, ఇంగో పెళ్ళి చేసుకొని పిల్లల్ని గన్నడు! నేను పని బాగ జేస్తనని

మా దొర కూలి ఎక్కువిస్తున్నాడు అని దెలిసి "నా కూతుర్ని నేను దోల్కపోత సారా అంగట్ల కూసోవెడితే మస్తు పైసలు సంపాయిస్తది! ఖాళీ సారా సీసాలు పోగు చేసి అమ్మకరమ్మంటే సంచుల సంచుల ఆదాయం దెస్తది" అని వచ్చిండు. గది తెలిసి మాయమ్మ నా కోతుర్ని నేను దోల్కపోత ఇల్లు వాకిలి అప్పజెప్తె ఒళ్ళరగ పనిజేస్తది. మనువు కంపితే పనిబాగ జేస్తదంటనాని ఓలి మస్తు ఇస్తరు అని వచ్చింది. మరిగిది ప్రేమయితే;" ప్రేమంటే పైసలేగాదూ?" అని అర్థం. కాని పిల్లవాడికి టీచరు ఎక్స్‌ప్లెయిన్ చేసినట్లు చెప్పింది. కాదనడానికి ఏ ఉదాహరణా లేదు మరి! డబ్బు ప్రసక్తి సొంత-తల్లి తండ్రీ, బిడ్డల సంబంధంలో కూడా ప్రముఖ పాత్ర వహిస్తున్నపుడు ఇక అసువంటి సామాజిక వ్యవస్థలో ఇతర సంబంధాలు డబ్బును కాదని ఉండగలవా?

"ఇంతకీ ఎవరిదగ్గరకూ వెళ్ళాలని లేదా నీకు"

"ఎందుకుంటదమ్మా! ఆళ్ళ దగ్గరుంటే నాకు జరిగేది ఏంది? ఏడయినా నా కూలినేను, నా పొట్టనేను, నా బట్టనేను నడుపుకొనవల్సిందే? వాళ్ళేమీ నన్ను నడపరు. ఇంగ సాన ఆలోచిస్తే నేనే వాళ్ళను నడుపుత! ఇంగెందుకు పోవాలె! వాళ్ళ ప్రేమ నా మీనగాదు. నాకూలిమీన" అంది మనసులో మాట, నిజమైన మాట స్పష్టం చేస్తూ! అలా స్పష్టం చెయ్యడానికి కూడా ధైర్యం కావాలనిపించింది!

"నీ పెళ్ళి అదీ చేస్తారు కదే పోనీ! మీ అవ్వ ముసలిదైపోయింది కదా!" అని ఆశచూపబోతే మళ్ళీ నవ్వింది.

"మా యమ్మకూ, మా అయ్యకూ వాళ్ళ పెండ్లిండే చేసుకోనీక రాకపోయే! ఇంగ నాకేం జేస్తరు. మాయవ్వ ముసలిగయినా గానీ బీడి కట్టలు గట్టి మా యమ్మకన్న ఎక్కువ సంపాయిస్తది. అయిన గానీ అమ్మతానిపోతే మారుతండ్రి కింద బతకాలె, మా నాయన తానికోతే మారుతల్లి కింద బతకాలె! నాకేం కర్మ పట్టిందమ్మా. నేను మా యవ్వ గుడిసెలనే ఉంట! మా మేనమామల పెండ్లాలు అవ్వను జూడరు. నేను మా యవ్వను జూస్కుంట ఉంటా" అంది అవ్వను చెయ్యి పట్టుకనీ.

"గిట్లుంటది జూడమ్మ! నేను దాని పెండ్లి జేయగల్గితినా?" అంది సైదు అమ్మమ్మ!

"నీవేంది నా పెండ్లి జేసేది నేనే జేసుకుంట! నా కష్టం జూసినోడు, నా కూలీ జూసినోడు నన్ను నమ్ముకోనొస్తే నేనే జాతర్ల అమ్మోరి ముందల జేసుకుంట! ఆడు చల్లగ సెట్టుకింద బీడి తాక్కుంటు గూకున్న గాని ఆడ్ని నడుపుత! ఆడి అమ్మ నాయనను నడుపుత! ఎవ్వడు జేసుకోకుంటే గూడ ఏంగాదు! పెండ్లి గాకుంటే ఏమయితది బతకనీకెరాదా?" అంది! ధీమాగా తననెవరయినా చేసుకుంటారని! తనకు పెళ్ళికి కావలసిన కష్టం చేయడం, కూలి సంపాదించడం అనే క్వాలిఫికేషన్స్ ఉన్నాయి కాబట్టి అని! "ముసల్లయినంక ఆళ్ళ పిల్లలు జూడకుంటే మాయమ్మ నాయనను కూడా నేనే నడుపుత" అన్నది మళ్ళీ.

ఇక ఆ అమ్మాయితో ఏవీ చెప్పి ఒప్పించలేననిపించింది!

ఆ అమ్మాయికున్న ఆ ధీమా తనకు ఆర్థిక సంబంధమైన హక్కు వైవాహిక సంబంధమైన నిర్ణయం తనకు సంబంధించినంత వరకూ తనవే కాబట్టి!

ఆ తర్వాత వహించే కుటుంబ బాధ్యత కూడా తనది. కాబట్టి అంతటి పరిపూర్ణతను జీవితం పట్ల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను ఇచ్చాయనిపిస్తుంది. ఇంతకంటే స్త్రీవాదం ఏముంది ప్రపంచంలో అనిపించింది కూడా!

ఆర్థిక స్వేచ్ఛ! తను సంపాదించగలదు! అంతకంటే జీవిత పునాది ఏముంది? ఆ పునాది పటిష్టమైనది కనుకే అది తన జీవితంలో బలంగా ఉన్నందున తన జీవితం పట్ల అంత ఆత్మ విశ్వాసం! ఎవరు లేకపోయినా తను బతగ్గలదు. తను ఒకరిమీద ఆధారపడవలసిన అవసరం లేకపోగా తనే కొంతమందికి ఆధారిత కావడమే స్త్రీత్వం! ఈ తత్వానికి ఆనాడు, ఈనాడూ తిరుగులేదనిపించింది!

★

కమ్యూనిస్టు పత్రికల కథ...

యాభై ఏళ్లకు పైగా కమ్యూనిస్టు పత్రికలలో పని చేసిన అరుదైన అనుభవశాలి బొమ్మారెడ్డి. అందులోనూ 1942లో తొలి ప్రజాశక్తి వార పత్రికతో మొదలుపెట్టి 1992 తర్వాత కూడా కొనసాగి దాని ప్రస్థానంలో ఒక కీలక పాత్ర వహించిన పాత్రికేయ పితామహుడు. ఆ చరిత్రను, దానితో తన అనుబంధాన్ని గ్రంథస్థం చేసి పాఠకులకు అందించాలన్న సంకల్పం ఈ వయసులో ఆయనకు కలగడం, దాన్ని నిర్విఘ్నంగా నెరవేర్చి ఈ పుస్తకం ప్రచురించడం అభినందనీయమైన అంశాలు. ఇది ఆయన నిబద్ధతను, రాజకీయ శ్రద్ధను తెలియజేస్తుంది.



కమ్యూనిస్టు పత్రికలు
చరిత్ర - వికాసం
రచన :వి.ఆర్.బొమ్మారెడ్డి, వెల:రు.45/-,
ప్రతులకు: ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు

తెలుగులో తొలి వామపక్ష పత్రిక అనదగిన "ప్రభ" తో మొదలు పెట్టి ప్రజాశక్తి వరకు కమ్యూనిస్టు పార్టీ ఏర్పాటు చేసిన వివిధ పత్రికల నేపథ్యాన్ని ఈ పుస్తకంలో ఆయన పొందుపరచారు. అవి నెలకొల్పిన ఉత్తమ సంప్రదాయాలను, ఎదుర్కొన్న ఇబ్బందులను గురించి తెలియజేశారు. సందర్భవశాత్తూ వాటి చరిత్రకు సంబంధించిన విశేషాంశాలను కూడా పేర్కొన్నారు. పార్టీ పత్రికల చరిత్ర పార్టీ నుంచి విడిగా వుండదు కనక పూసల్లో దారంలా రాజకీయ పరిణామ క్రమం కూడా చెప్పారు.

కేవలం తెలుగులోనే గాక మళయాళ, బెంగాలీ భాషలలో గల కమ్యూనిస్టు పత్రికలైన దేశాభిమాని, గణశక్తి వంటి వాటి చరిత్ర కూడా ఇచ్చారు. మార్క్స్, ఎంగెల్సులు పత్రికలలో చేసిన కృషికి సంబంధించిన వ్యాసాన్ని పునర్ముద్రించారు. తొలి రోజులలో పార్టీ నడిపిన కేంద్ర పత్రికల వివరాలు కూడా ఇచ్చారు. ఈ నాడు సిపిఐ, సిపిఐ-ఎంలు వివిధ భాషలలో నడుపుతున్న పత్రికల జాబితా పేర్కొన్నారు. ఒక్క చోటనే ఈ వివరాలన్నీ లభ్యం కావడం తెలుగులో ఇదే ప్రథమం. ఇందుకోసం ఆయన పలువురితో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపినట్టు కనిపిస్తుంది. వీటి వల్ల పుస్తకం విలువ పెరిగింది.

తెలుగులో కమ్యూనిస్టు పత్రికలకు సంబంధించి ఈ తరాల వారికి అంతగా తెలియని అనేక వివరాలు దీంట్లో లభిస్తాయి. అలాగే నిర్బంధ కాలంలో పార్టీ పత్రిక నిర్వహణ ఎంత క్లిష్టమైందో, కత్తిమీదసాములాంటిదో అర్థమవుతుంది. ఆ నాటి కొన్ని వాస్తవానుభవాలు కూడా ఆయన ఇచ్చారు. ఇన్ని అవరోధాల మధ్యనా పార్టీ పత్రికలను నడపడానికి కమ్యూనిస్టులు ఎందుకంత ప్రాధాన్యత నిస్తారనే విషయం ఇందులోనే పొందుపరచిన మార్క్స్, ఎంగెల్సు, లెనిన్ బోధనల ద్వారా విశదమవుతుంది.

ఈ మంచి విషయాలతో పాటు పుస్తకానికి కొన్ని పరిమితులు కూడా వున్నాయి. ఇప్పటికే పలు సందర్భాలలో వెల్లడించిన విషయాలకే ఆయన పరిమితమయ్యారు. ఆయా దశల్లో ఆ పత్రికల ప్రత్యామ్నాయ వైఖరికి కొన్ని ఉదాహరణలు, దాని ప్రభావం చెబితే ఉపయుక్తంగా వుండేది. ప్రజాశక్తి ఇప్పుడు నాలుగు ఎడిషన్లతో పురోగమించడాన్ని ఆయన అభినందనపూర్వకంగా ఇవ్వడం సముచితంగానే వుంది. ఎందుకంటే తెలుగునాట ఇప్పటి వరకూ పార్టీ నడిపిన పత్రికలలో ప్రజాశక్తి విస్తరణ చాలా ఎక్కువనేది అందరూ సంతోషిస్తున్న వాస్తవం. ఇందుకోసం ఉద్యమ పరంగా, పత్రికా పరంగా అనుసరించిన విధానాలు క్లుప్తంగానైనా చెబితే ఈ పరిణామ క్రమం మరింత బాగా అర్థమవుతుంది.

రచయిత ఈ పుస్తకాన్ని స్వీయ ప్రచురణగా తెచ్చినప్పటికీ పార్టీ పత్రికలకు సంబంధించింది గనుక మరికొన్ని జాగ్రత్తలు తీసుకోవలసింది. ఇలాటి రచనల్లో వ్యక్తిగత కోణాన్ని మొత్తం చరిత్రను సమతుల్యంగా చూడటం చాలా అవసరం. ఆ సంయమనం కొంత లోపించింది. ప్రచురించిన కొన్ని ఫోటోలు, సన్మాన పత్రాలు, ఏవో వ్యాసాల పునర్ముద్రణలు పత్రికల చరిత్ర అధ్యయనానికి దోహదపడేవి కాదు. ఇంతకంటే ఆ పత్రికల ప్రారంభ ఘట్టాలు, పురోగమనాలకు సంబంధించిన చిత్రాలు, అప్పటి పెంపుదల ఉద్యమాల వివరాలు ఇవ్వడానికి ప్రయత్నించాల్సింది. పార్టీ చరిత్రకు సంబంధించి ఇప్పటికే ప్రచురితమైన కొన్ని పుస్తకాలలో అలాటివివరాలు వున్నాయి. అలాగే వ్యక్తులు పత్రికలలో నిర్వహించిన బాధ్యతలకు సంబంధించి, వేసిన ఫోటోలకు సంబంధించి ప్రామాణికత లోపించింది. వ్యక్తుల పాత్రే ప్రధానం గాక పోయినా పేర్లంటూ ఇచ్చారు గనుక కొన్ని ముఖ్యమైనవి మిస్ అయ్యాయనే భావం కలుగుతుంది. పార్టీ నాయకులు, పత్రికల మేనేజిమెంటు బాధ్యులు కూడా ఈ పురోగమనానికి బహువిధాల కృషి చేశారు. పార్టీ పత్రికల అభివృద్ధిలో సంపాదక విభాగంతో పాటు అటు ఉద్యమ భాగస్వామ్యం, ఇటు మేనేజిమెంటు నైపుణ్యం కూడా చాలా ప్రధానమని అర్థమవడానికి ఈ భాగాన్ని కూడా ప్రస్తావించి వుంటే సమగ్రత చేకూరేది.

ఇలాటి పరిమితులున్నప్పటికీ ఈ పుస్తకం పార్టీ పత్రికల చరిత్రను తెలుసుకోవడానికి బాగా ఉపయోగపడుతుందనడంలో సందేహం లేదు.

- తె.ర.

స్వీకారం



ఈ పుస్తకంలో మొత్తం 22 కథలున్నాయి. నిఖిలేశ్వర్ 40 సంవత్సరాల్లో రాసిన కథల నుండి ఈ కథలను ఏరి ముద్రించారు. ఇందులో ఆయన తన విప్లవ పోరాటానికి, మన విద్యా వ్యవస్థకు, మధ్య తరగతి సమస్యలకు, స్త్రీ, పురుష సంబంధాలు, యుద్ధం, మతం, భూమి సమస్య, విదేశీ జీవితానికి సంబంధించిన ఇతివృత్తాలను ఎన్నుకున్నారు

నిఖిలేశ్వర్ కథలు
రచన : నిఖిలేశ్వర్, వెల : రు.60/-,
ప్రతులకు : విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు

సర్దార్ యల్లంపల్లి సిద్ధయ్య నాయుడు
రచన : పావుదేశి పెరుమాళ్ళు నాయుడు ,
వెల : రు.25/-,
ప్రతులకు :
పి. పెరుమాళ్ళు నాయుడు,
రిటైర్డ్ తెలుగు పండిట్,
అరగొండ్ల, చిత్తూరు జిల్లా



భగవద్గీత చారిత్రక పరిణామంలో హిందూ ధర్మం అని వ్యవహరించే జీవన విధానానికి ప్రామాణిక మత గ్రంథం అయింది. సాంఘికంగా ఇది ఇవాళ పురోగమన పథం వైపు మళ్ళించే మార్గం అందించలేదు. ఈ విషయం బోధపడితే గాని శ్రామిక జన విముక్తి పోరాటం ముందుకు సాగదు. గీత ఇవాళ సాంఘికంగా నిర్వహించగలిగిన పాత్ర ఏమీ లేదు. మార్క్సిస్టు గతి తార్కిక, చారిత్రక, భౌతికవాద సిద్ధాంతం పునాదిగా గతాన్ని అర్థం చేసుకొనేందుకు గీత ఇలా ఉపయోగపడవచ్చు.

భగవద్గీత - మార్క్సిజం
రచన : ఆర్వియార్, వెల : రు.10/-,
ప్రతులకు : విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్నిబ్రాంచీలు